క్లుప్తంగా

కుల సంఘాల సంక్షేమానికి కృషి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్: కుల సంఘాల సంక్షేమానికి తన వంతు కృషి ఎప్పుడూ ఉంటుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. పట్టణంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద గౌడ కమ్యూనిటీ హాల్ రూ.10లక్షల నిధులతో నిర్మించే భవనానికి మంగళవారం సాయంత్రం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. మహిళలు, గీత కార్మికులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల నిరసన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమం కోసం అమల్లో ఉన్న చట్టాలనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్ డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో మంగళవారం వారు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని కోరారు. నాయకులు వెంకటస్వామి, బొంకూరి సాగర్, మరియ, అన్వేష్, లక్ష్మి, దేవమ్మ, శంకర్, పూణేశ్, నర్సమ్మ పాల్గొన్నారు.

వానాకాలం సాగుపై అవగాహన

రామగుండం: రానున్న వానాకాలంలో వివిధ రకాల పంటలు సాగుచేసే రైతులకు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతరత్రా సాగుకు యోగ్యమైన నిర్ణయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రాహ్మణపల్లి రైతువేదికలో మండల వ్యవసాయాధికారి సతీశ్ మంగళవారం సాగుపై సలహాలు, సూచనలు ఇచ్చారు. సకాలంలో నాట్లు వేసుకోవాలని, పచ్చిరొట్టతో భూమిలో సారం పెంచుకోవాలని, యూరియా వినియోగాన్ని క్రమంగా తగ్గించాలని సూచించారు. ఉద్యానవనశాఖలో ఆయిల్‌పామ్ సాగుకు 90శాతం సబ్సిడీ, డ్రిప్ పరికరాలకు 90 నుంచి 100శాతం రాయితీ, పందిరి కూరగాయల సాగుకు 50శాతం రాయితీ, కూరగాయల నారుకు వందశాతం రాయితీ, పండ్ల తోటల సాగుకు 40శాతం రాయితీ పొందే వీలుంటుందని వివరించారు. రైతులు జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ఎ.జ్యోతి నంబర్ (89777 14039)ను సంప్రదించవచ్చన్నారు. ఏఈవో హరీశ్, రమేశ్, హార్టికల్చర్ అధికారిణి జ్యోతి, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్, రైతులు హాజరయ్యారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

జ్యోతినగర్: కేంద్ర ప్రభుత్వం వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, దేశంలోని అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యునైటెడ్ ఫోరం నాయకులు చిలుక శంకర్, భూమల్ల చందర్, నాంసాని శంకర్, భూమయ్య, రాజమల్లయ్య, గీట్ల లక్ష్మారెడ్డి, జమీల్, సత్యం, శ్రీనివాస్, వెంకటేశ్, దండ రాఘవరెడ్డి, సమ్మిరెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జూలై 9న దేశవ్యాప్త సమ్మె

సుల్తానాబాద్: దేశవ్యాప్తంగా జూలై 9న సమ్మె చేసేందుకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 20న జరగాల్సిన దేశవ్యాప్త సమ్మెను జూలై 9కి వాయిదా వేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయం తీసుకున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు లక్ష్మణ్, మల్లేశ్, సురేశ్, వినోద్, రామ్మూర్తి, నరసింగం, మధు, చంద్రయ్య పాల్గొన్నారు.

రోగులపై నిర్లక్ష్యం.. దురుసు ప్రవర్తన

- మారని మంథని ప్రభుత్వాసుపత్రి తీరు
- రోజూ 200మందికి పైగా రోగులు.. సరిపడా సౌకర్యాలు కరువు
- 11 మందికి విధుల్లో ఇద్దరు లేదా ముగ్గురు వైద్యులు



మంథని ఆస్పత్రిలో విధుల్లో ఉన్న ఒకే ఒక్క వైద్యురాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

మంథని: మంథని సర్కారు ఆస్పత్రిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఇక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది ఇష్టారీతిన పనిచేస్తున్నారు. దీంతో ఈ ప్రాంత పేదలకు సర్కారు సేవలు నామమాత్రమే అయ్యాయి. వైద్యులు వంతుల వారీగా విధులకు హాజరవుతున్నా ఇక్కడ షరామామూలే అన్న చందంగా మారింది. మంగళవారం ఆస్పత్రిని 'సాక్షి' విసిట్ చేయగా అనేక విషయాలు వెలుగుచూశాయి.

విధుల్లో ఒకరిద్దరే..

మంథనితో పాటు ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాలతో పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండల ప్రజలకు నియోజకవర్గ కేంద్రంలో ఉన్న మంథని సామాజిక వైద్యశాల పెద్ద దిక్కు. ఇక్కడ ప్రైవేటు ఆస్పత్రులు లేవు తక్కువ. పేరుకు 50 పడకల ఆస్పత్రిగా ఉన్నప్పటికీ సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రోగుల సౌకర్యార్థం ఇటీవల ఆస్పత్రిని రెనెవేషన్ చేశారు. ఆర్డీవో కార్యాలయ సమీపంలో నూతనంగా 50పడకల ఆస్పత్రి నిర్మాణంలో ఉంది. కాగా ఇక్కడ 11మంది వైద్యుల్లో నిత్యం ఓపీ విధుల్లో ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ఉంటున్నారని రోగులు వాపోతున్నారు. వంతుల వారీగా విధులకు రావడం కూడా సర్వసాధారణమే. మంగళవారం ఓపీలో ఒక వైద్యురాలు రోగులను చూస్తుండగా మరో ఇద్దరు వైద్యులు అత్యవసర కేసులకు వైద్యం అందిస్తూ కనిపించారు.

రోగులపై నిర్లక్ష్యం..

వైద్యుడిని దేవుడిగా భావించే గ్రామీణులు ఎక్కువగా వచ్చే మంథని ఆస్పత్రిలో రోగులతో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా, దురుసుగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సరైన సమాధానం చెప్పకపోవడం, మర్యాదగా ప్రవర్తించకపోవడం లాంటి చర్యలతో అసౌకర్యానికి గురవుతున్నామని రోగులు వాపోతున్నారు. అంతేకాకుండా చిన్న చిన్న సమస్యలతో రోగి ఆస్పత్రికి వచ్చినా కేవలం ప్రథమ చికిత్స చేసి పెద్దపల్లి, గోదావరిఖని, కరీంనగర్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు.

నిత్యం 200 మందికి పైగానే రోగులు..

ఎండ తీవ్రత అధికంగా ఉన్నా సర్కారు ఆస్పత్రికి రోగుల తాకిడి అధికంగానే ఉంది. రోజూ 200 మందికి పైగా ఓపీ వస్తుండగా 5 నుంచి 10 మంది ఐపీ సేవలు పొందుతున్నారు. వారంరోజుల పట్టికను పరిశీలిస్తే 13న 210, 14న 209, 15న 220, 16న 221, 17న 203, 19న 200 మందికి పైగా రోగులు వచ్చినట్లు రికార్డుల్లో నమోదైంది. ఇందులో 20 మందికి పైగా జ్వరాలతో బాధపడుతున్నవారు వస్తుండగా మిగతా రోగులు వివిధ సమస్యలతో బాధపడుతున్న వారే.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై మంత్రులు సానుకూలం



వినతిపత్రం ఇస్తున్న సంపత్‌గౌడ్

ఎలిగేడు: జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసే విషయమై రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. మండలంలోని ముప్పిరితోటలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరైన మంత్రులకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. జిల్లాలో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వ స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తప్పకుండా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు గాను ఎక్కడెక్కడ ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో గుర్తించాలని మంత్రి శ్రీధర్ బాబు కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫోన్ చేసి ఆదేశించారు. జిల్లా అధ్యక్షుడు బుర్రసంపత్ కుమార్‌గౌడ్, రాష్ట్ర మఫిషియల్ కమిటీ సభ్యులు సామల హరికష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమూర్తి యాదవ్, భూకల సారయ్య, సీనియర్ జర్నలిస్టులు గుడ్ల శ్రీనివాస్, కేతిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, కల్వల శంకర్, తిరుపతిగౌడ్, లక్ష్మీపతి, అశోక్, సతీశ్‌రెడ్డి, రంజిత్, నాగపురి తిరుపతి, జె.లక్ష్మణ్ పాల్గొన్నారు.

మంత్రి 'పొంగులేటి'కి కలెక్టర్ స్వాగతం



పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్‌లో పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఎలిగేడు మండలం ముప్పిరితోటలో జరిగే భూభారతి కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



జూలపల్లి: శోభాయాత్రలో మాలధారణ స్వాములు



కాల్వశ్రీరాంపూర్‌లో..

జూలపల్లి: మండల కేంద్రంలో హనుమాన్ మాల ధారణ భక్తులు శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ఉదయం మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి, రాజేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి, పెద్దమ్మ, రేణుకాఎల్లమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజనలు చేస్తూ గ్రామంలో శోభాయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో శోభాయాత్రకు స్వాగతం పలికారు. నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి, హనుమాన్ మాలధారణ భక్తులు దేవసాని మారుతి, మేర శ్రీనివాస్, బండి శ్రీనివాస్, రవీందర్, విద్యాసాగర్, బండి రాజయ్య పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్, మీర్జంపేట, తారుపల్లి గ్రామాల్లో మంగళవారం హనుమాన్ మాలధారణ స్వాములు శోభాయాత్ర నిర్వహించారు. భజనలు, కీర్తనలతో ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక వాహనాల్లో భద్రాచలం, కొండగట్టు యాత్రా స్థలాలకు బయలుదేరి వెళ్లారు. ఆయా గ్రామాల్లో మాజీ ఎంపీపీలు సారయ్యగౌడ్, సంపత్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించాలి



పూజల్లో మనాలి ఠాకూర్

రామగుండం: రామగుండం బైపాస్ రోడ్డు ఎదుట ఉన్న రామునిగుండాల కొండపై స్వయంభూగా వెలిసిన శ్రీధనుర్బరామాంజనేయస్వామి దేవాలయంలో పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్ అన్నారు. మంగళవారం ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

టోల్‌ప్లాజా వద్ద లారీ యజమానుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న లారీ యజమానులు

పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలో ఫోర్‌లైన్ రహదారిపై గల కన్నాల టోల్‌ప్లాజా వద్ద మంగళవారం రామగుండం, స్థానిక లారీల యజమానులు ధర్నా నిర్వహించారు. ప్లాజాకు 20కిలోమీటర్ల పరిధిలో గల లారీలకు ఎలాంటి టోల్ వసూలు చేయొద్దంటూ డిమాండ్ చేస్తూ ప్లాజా గేట్ల వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. 12ఏళ్లుగా టోల్ వసూలు చేస్తున్న హెచ్‌కేఆర్ యాజమాన్యం ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. ఫోర్‌లైన్ రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు, గ్రీనరీ, విశ్రాంతి గది, మెడికల్ సర్వీస్‌లు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో స్థానికంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజులుగా స్థానికంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో వాహనాలు టోల్‌ఫ్రీగా వెళ్తున్నాయి. లారీ యజమానుల సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బయ్యపు మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, రామగుండం ఏరియా లారీ యజమానులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల పరిశీలన

ఓదెల: మండలంలోని శానగొండ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను ఎంపీడీవో తిరుపతి, పీఆర్ఏఈఈ జగదీశ్వర్ మంగళవారం పరిశీలించారు. మండలంలో పైలట్ గ్రామంగా ఎంపిక చేసిన శానగొండలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు.

• తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో ఉదయం గీత కార్మికుడు గుండు రాజమౌళి (55)తాటి చెట్టుపై నుంచి పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. రాజమౌళి మంగళవారం ఉదయం కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కే క్రమంలో మోకు జారడంతో కింద పడి గాయాలపాలయ్యాడు. నడుముకు గాయాలు కాగా, నడవలేని స్థితి ఉన్న అతడిని 108 ద్వారా కరీంనగర్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. బాధితుని పరిస్థితి విషమంగానే ఉందని పెద్దాపూర్ గీతకార్మిక సంఘం అధ్యక్షుడు బుర్ర శంకరయ్య తెలిపారు.

• విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

పాలకుర్తి: మండలంలోని రాణాపూర్ గ్రామ శివారులో మంగళవారం విద్యుత్‌షాక్‌తో గేదె మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కమాన్‌పూర్ మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన బూడిద శ్రీనివాస్‌కు చెందిన గేదె రాణాపూర్ గ్రామ శివారులో మేతమేస్తోంది. ఈక్రమంలో సమీపంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ దాదాపు రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు శ్రీనివాస్ వేడుకుంటున్నాడు.

• దళితులను అవమానించారని అధికారులను ప్రశ్నించడం తప్పా?

రామగిరి: సరస్వతి పుష్కరాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని, దళిత ఎంపీని అవమానించారని అధికారులను ప్రశ్నిస్తే తప్పా అని బీఆర్ఎస్ నాయకులు శంకేశీ రవీందర్, పూదరి సత్యనారాయణగౌడ్, మ్యాదరబోయిన కుమార్‌యాదవ్ ప్రశ్నించారు. మండలంలోని సెంటినరికాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు అధికారం ఉందని తమ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుపై ఇష్టారీతిన మాట్లాడితే సహించేది లేదన్నారు. సెంటినరికాలనీ పట్టణ అధ్యక్షుడు కాపురబోయిన భాస్కర్, దర్శుల రాజసంపత్, హరీశ్, దామెర శ్రీనివాస్, జాపతి శేఖర్, బొంకూరి పోచం, ఆసం తిరుపతి, సదానందం, అనిల్ పాల్గొన్నారు.

• ఆలయాల్లో హోమం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని పూసాల ఆంజనేయస్వామి, మార్కండేయ స్వామి, పెరిక గిద్దె ఆలయాల్లో హనుమాన్ మలధారణ స్వాములు మంగళవారం హోమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం హోమం నిర్వహించారు.

• అద్దె బస్సు డ్రైవర్ల డిమాండ్లు పరిష్కరించాలి

మంథని: అద్దె బస్సు డ్రైవర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ కోరారు. అద్దె బస్సు డ్రైవర్లు రెండు రోజులుగా సమ్మె చేస్తున్నారు. మంగళవారం వీరికి మద్దతుగా గణేశ్‌తో పాటు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రంకల సురేశ్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మంథని లింగయ్య మద్దతు తెలిపారు. అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు మహేశ్, నాయకుడు సతీశ్, తదితరులు ఉన్నారు.

• మంత్రి కుటుంబాన్ని విమర్శించే హక్కు పుట్ట మధుకు లేదు

ముత్తారం: మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబాన్ని విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు లేదని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య అన్నారు. మండలం కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. సింగిల్‌విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్, నాయకులు అనుము సమ్మయ్య, దాసరి చంద్రమౌళి, మాజీ సర్పంచులు రజిత రఫీ, రాపల్లి రామన్న, సంపత్‌రావు, తాటిపాముల శంకర్, లక్కం ప్రభాకర్, అనుప్రశాంత్ పాల్గొన్నారు.

పెళ్లి కూతురును ముస్తాబు చేసిన మాజీ జెడ్పీటీసీ



వేడుకల్లో కందుల సంధ్యారాణి

రామగుండం: పట్టణంలోని తబితా ఆశ్రమానికి చెందిన యువతి నక్క మానసకు బుధవారం కలెక్టరేట్‌లో వివాహం జరగనుంది. ఆశ్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి మంగళవారం పెళ్లి కూతురును స్వయంగా తయారు చేసి పెళ్లి వస్త్రాలు అందజేసి దీవించారు. సీడీపీవో అలేఖ్య, పెళ్లి కూతురు సోదరి నక్క లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ పెండ్యాల విమలమ్మ, ఆశ్రమ నిర్వాహకులు వీరేందర్‌నాయక్–విమలమ్మ దంపతులు, రెండు మండలాల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, స్వశక్తి మహిళా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలివ్వాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు వెంటనే ఇవ్వాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీఎంపీఎఫ్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు కార్మికులకు మూడున్నరేళ్లుగా సీఎంపీఎఫ్ లెక్కలు చూపలేదని, పుస్తకాలు, చిట్టీల రూపంలో ఇవ్వలేదన్నారు. దీంతో కాంట్రాక్టు కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా చిట్టీలు అందజేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి వెంకన్న, నరేశ్, అశోక్ పాల్గొన్నారు.

సింగరేణిలో నూతన బదిలీ విధానం రద్దు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో నూతన బదిలీ విధానాన్ని రద్దు చేయాలని ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆఫీస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగుల మనోభావాలు దెబ్బతీసేలా, కార్మికులను మానసిక వేదనకు గురిచేస్తూ నష్టం వాటిల్లేలా సర్క్యులర్ ఉందన్నారు. సర్క్యులర్ రద్దు చేయాలని యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ సంస్థ సీఅండ్ఎండీ బలరాంకు వినతిపత్రం అందజేశారన్నారు. కార్మికులకు సులభతరంగా ఉండే బదిలీ విధానాన్ని కొనసాగించాలని వారు కోరారు. సర్వీస్ నిబంధనలు పెట్టి కార్మికులను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలను సంప్రదించకుండా సర్క్యులర్ విడుదల చేశారన్నారు. దీంతో కార్మికులు ఒత్తిడికి లోనై ఆ ప్రభావం ఉత్పత్తిపై చూపే అవకాశం ఉందన్నారు. సమావేశంలో నాయకులు ధర్మపురి, దాస్, గడ్డం కృష్ణ, శ్రీనివాస్, రమేశ్, ఆంజనేయులు, సదానందం, మనోహర్, రవి, రామస్వామి, కుమారస్వామి పాల్గొన్నారు.

24న ట్రినిటిలో ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీలో 24న కార్పొరేట్ స్థాయి కంపెనీలతో ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ క్యాంపస్ డ్రైవ్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆయన మంగళవారం ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. తమ కాలేజీలో బీటెక్, ఎంబీఏ 2022, 23, 24, ప్రస్తుత విద్యా సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ గణేశ్, ఏవో సురేశ్, రాజిరెడ్డి, హెచ్‌వోడీలు ఆరిఫ్, నటరాజన్, పద్మిని, స్వాతి, ప్రభాకర్, రామ్మోహన్, చొప్పరి వంశీ ఉన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం



నగదు అందజేస్తున్న ఎస్సై, టీం సభ్యులు

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన నారగోని సతీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ టీం సభ్యుల సేవలు అభినందనీయమని కమాన్‌పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పిల్లిపల్లెకు చెందిన ముక్కెర వైష్ణవికి హెల్పింగ్‌హ్యాండ్స్ సౌజన్యంతో రూ.లక్ష4వేలు ఆర్థికసాయంగా అందజేశారు. వైష్ణవి గత కొన్ని నెలలుగా లివర్ వ్యాధితో బాధపడుతోంది. వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత ఆమె కుటుంబానికి లేదు. దీంతో సాయంకోసం హెల్పింగ్‌హ్యాండ్స్ నిర్వాహకులు సతీశ్‌కు విన్నవించగా టీం సభ్యులు సేకరించిన డబ్బులు అందజేశారు. కార్యక్రమంలో ఇనగంటి రోహిత్, మచ్చగిరి రాము, మేడగోని విజయ్, శేఖర్, పిల్లి రాజు, మల్యాల విజయ్, నరేశ్, పిట్టల తిరుపతి, ఎండీ అజ్జర్, నజీద్ పాల్గొన్నారు.

సుందరయ్య పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి



నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: స్వాతంత్ర్య సమరయోధుడు దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి అన్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు, ప్రవీణ్‌కుమార్, విజయ్ కుమార్‌రెడ్డి, రాంప్రసాద్, భూమయ్య, చంద్రశేఖర్, లక్ష్మీబాయి, సాంబరావు, శివకుమార్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు దోహదం

కాల్వశ్రీరాంపూర్: ఉపాధ్యాయుల్లో బోధనా సామర్థ్యాలు పెంచేందుకు శిక్షణ తరగతులు దోహదం చేస్తాయని ఎంఈవో మహేశ్‌కుమార్ అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో మంగళవారం ఉపాధ్యాయులకు ఐదురోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఆర్పీలు సదయ్య, స్వప్న, మల్లికార్జున్, వేణు, కుమార్, దేవేందర్, భానుచందర్, రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరం

రామగుండం: పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ డిజిటల్ తరగతి గదిలో టీచర్లకు ఐదురోజుల వృత్యంతర శిక్షణ శిబిరాన్ని రామగుండం ఎంఈవో చంద్రయ్య మంగళవారం ప్రారంభించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ రమేశ్, ఆర్పీలు స్నేహలత, శ్రీనివాస్, రఘుబాబు, రాజేశ్, రవీందర్, రాజిరెడ్డి, సంపత్, ఫ్రాన్సిస్, సీఆర్పీ రామ్‌కుమార్ ఉన్నారు.

మీ సేవలు అభినందనీయం



కలెక్టర్‌కు విన్నవిస్తున్న శారద

రామగిరి: ఆర్‌ఎస్‌కే అపన్నహస్తం ద్వారా కల్వచర్లలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రేండ్ల శారద కుమార్‌స్వామి దంపతులను కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్షను రేండ్ల శారద కుమార్‌స్వామి దంపతులు కలిసి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని విన్నవించారు. 'అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారని, భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, మీ సేవలు అభినందనీయం' అని కలెక్టర్ ప్రశంసించినట్లు శారద తెలిపారు.

శివాలయం పునర్ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న క్యాదాసి మల్లేశ్

ఓదెల: మండలంలోని కొలనూర్ శివాలయం పునర్ నిర్మాణానికి క్యాదాసి మల్లేశ్–మల్లేశ్వరి దంపతులు రూ.లక్ష ఆలయ కమిటీ చైర్మన్ కలకొండ రాజిరెడ్డికి మంగళవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ పాలకవర్గం దాత మల్లేశ్‌ను అభినందించింది.